

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 26.0
తణుకు : 29.0 - 26.0

పశుగ్రాసం కొరత

వరద ముప్పుతో కొల్లేరు, ఆక్వా చెరువులు మునిగిపోవడంతో పశుగ్రాసం కొరత ఏర్పడనుంది. గ్రామాల చుట్టూ నీరు చేరడం, చెరువు గట్లపై ఉన్న పచ్చగడ్డి కుళ్లిపోతోంది. దీంతో పశువులకు గ్రాసం లేకుండా పోతుంది. పశుగ్రాసం ఏర్పాటు చెయ్యాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

జల దిగ్బంధం


ఆచంట వేమవరంలో ముంపులో పొలాలు

కొల్లేరును చుట్టుముట్టిన వరద

ఉధృతంగా ప్రవహిస్తున్న ఉప్పుటేరు

వరి, ఆక్వాకు భారీ నష్టం.. కాపాడేందుకు రైతుల పాట్లు

ఆకివీడు రూరల్/కైకలూరు, సెప్టెంబరు 9 : కొల్లేరును వరద ఉధృతి చుట్టుముట్టేసింది. బుడమేరు, తమ్మిలేరుతోపాటు వివిధ డ్రెయిన్ల ద్వారా ఎగువ నుంచి వరద కొల్లేరుకు చేరడంతో కొల్లేరు నీటిమట్టం పెరుగుతోంది. పెద్దఎడ్లగాడి వద్ద ఆదివారం 3.36 మీటర్ల వున్న కొల్లేరు సోమవారం 3.40 మీటర్లకు చేరుకుంది. కొల్లేటిలంక గ్రామాలకు వెళ్లే రహదారులు జల దిగ్బంధంలో ఉన్నాయి. మండవల్లి మండలం పెనుమాకలంక, నందిగామలంక, శ్రీరామ్‌నగర్, ఇంగిలిపాకలంక, నుచ్చుమిల్లి, తక్కెళ్లపాడు వంటి గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. పడవల ద్వారా రాకపోకలు సాగించడం తప్ప మరో మార్గం లేదు. మంచినీళ్ల కోసం కొల్లేటివాసులు అవస్థలు పడుతున్నారు. కొల్లేటి ఎగువ గ్రామాలైన ఉనికిలి, మూలపేట, నాగభూషణపురం వరకు ముంపు పరిస్థితి ఏర్పడింది. చేపల చెరువులకు వెళ్లే రహదారులు పూర్తిగా నీట మునిగాయి. కొన్ని ప్రాంతాల్లోని చెరువులు గట్లు ముంపునకు గురై రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. చెరువు గట్లపై చేపలు బయటకు వెళ్లకుండా వలలతో కట్టడి చేస్తున్నారు. కొల్లేటి ఉధృతికి రహదారులు జలమయంగా మారాయి. చేపల చెరువులు ముంపు బారినపడి వరద నీటిలో కలిసిపోతుండడంతో రైతులు లక్షల్లో నష్టాలను చవి చూస్తున్నారు. కొంతమంది వచ్చిందే చాలన్నట్లు హడావుడిగా చేపలు, రొయ్యలను పట్టుబడులను చేస్తున్నారు. కొల్లేటి వరద ఆక్వా, వ్యవసాయ రంగాలకు ముప్పుగా పరిణమించింది. ఉప్పుటేరు ఉగ్రరూపం దాల్చడంతో కొల్లేరు తీర ప్రాంతాలలోని ఆకివీడు, సిద్దాపురం, కళింగపాలెం, చినిమిల్లిపాడు, రాజులపేట, కోళ్ళపర్రు, గుమ్ములూరు, చినకాపవరం, పెదకాపవరం గ్రామాలలోని వరి పొలాలు నీట మునిగాయి. ఆక్వా చెరువుల్లోకి నీరు చేరుతుండటంతో వలలు, ఆపాలు కడుతున్నారు. కొన్ని చెరువులకు వరద నీరు గట్లను తాకుతున్నది. సిద్దాపురంలో వరి రైతులు వరకు వరద నీటితో పోరాడారు. మట్టి బస్తాలు వేసినప్పటికి వరద రోజు రోజుకు పెరగడంతో గట్లపై నుంచి నీరు ప్రవహించి వరి చేలు నీటిలో మునిగిపోయాయి. ఆక్వా చెరువులకు వలలు, ఆపాలు కట్టినప్పటికి చేపలు నీటికి ఎదురీది వాటిలో నుంచి బయటకు వెళ్లిపోతున్నాయి. రొయ్యలు అయితే చనిపోయే ప్రమాదముందని రైతులు వాపోతున్నారు. వరద నీరు ఎప్పటి వరకు పెరుగుతుందో అధికారులు సరిగా అంచనా వేయలేకపోతున్నారు. ఎన్ని రోజుల్లో వరద తగ్గుతుందో కూడా చెప్పలేకపోతున్నారు. దీంతో ఆక్వా రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు.


నీట మునిగిన ఆక్వా చెరువులకు వలలు

దొరికిందే చాన్స్

వరద ముప్పుతో ఇబ్బందులు పడుతున్న ఆక్వా రైతులకు వ్యాపారుల నుంచి మరిన్ని కష్టాలు ఎదురవుతున్నాయి. వరద ముంపు వల్ల సరుకు పట్టేద్దామని అనుకున్న రైతులకు వ్యాపారస్థులు దొరికిందే ఛాన్స్‌గా తక్కువ రేటు ప్రకటిస్తున్నారు. చెరువులోని సరుకు పట్టకుండా ఉండలేని పరిస్థితి. పడితే వ్యాపారులు అడిగిన ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి. అధికారులు స్పందించి ఆక్వా రైతులకు అండగా నిలబడాలని కోరుతున్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న ఉప్పుటేరు

ఉప్పుటేరు ఉధృతంగా ప్రవహిస్తున్నది. రైల్వే వంతెన వద్ద ప్రస్తుతం నీటిమట్టం 2.40 మీటర్లుగా ఉంది. ఇక్కడ తూడు, కిక్కస తొలగిస్తుండటంతో నీటి ప్రవాహం పెరిగింది. దీనికితోడు పైనుంచి నీటి ప్రవాహం పెరగడంతో ఉప్పుటేరు ఉగ్రరూపం దాల్చుతున్నది. నీటి ప్రవాహం పెరుగుతుండటంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు, రైతుల మరింత ఆందోళన చెందుతున్నారు. ఉండి, కైకలూరు ఎమ్మెల్యేలు కె.రఘురామకృష్ణరాజు, కామినేని శ్రీనివాస్, ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సమీక్షిస్తున్నారు. డ్రైనేజీ అధికారులు ఉప్పుటేరు వద్దనే తిష్ట వేసి మరి పర్యవేక్షిస్తున్నారు. లాంగ్‌స్టిక్ కలిగిన ప్రొక్లెయిన్‌తో వంతెనపై నుంచి తూడు, గుర్రపు డెక్క తొలగిస్తున్నారు.



పొంగుతున్న ఎర్రకాలువ

» మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 9 : భారీ వర్షాలకు ఎర్రకాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇప్పటికే వరదలతో వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. అక్కడక్కడా వరి చేలకు ఎరువులు పిచికారి చేసి పంట పునరుద్ధరించుకునే రైతులకు ఈసారి ఎర్ర కాలువ ప్రవాహం ముంచుకొస్తుండంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. కంసాలిపాలెం-మాధవరం రోడ్డు వంతెనపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండంతో రెండు మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. నందమూరు అక్విడెక్టు వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేశారు. నిడదవోలు మండల ప్రత్యేక అధికారి దుర్గేష్ అక్విడెక్టు ప్రాంతాన్ని పరిశీలించారు.

• పెరుగుతున్న యనమదుర్రు

భీమవరం టౌన్, సెప్టెంబరు 9 : ఎర్రకాల్వలో నీటిమట్టం పెరగడంతో పట్టణం మీదుగా ప్రవహిస్తున్న యనమదుర్రు ఉధృతి పెరిగింది. ప్రస్తుతం 29.9 అడుగల నీటిమట్టం ఉండడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మంగళవారం ప్రవాహ పరిస్థితిని బట్టి నీటిమట్టం పెరిగితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

• గోదావరి ఇక్కడ తగ్గి.. అక్కడ పెరిగి

ఆచంట/నరసాపురం, సెప్టెంబరు 9:రెండు రోజులుగా ఉగ్రరూపం దాల్చిన గోదావరి ఆచంట, యలమంచిలి, నరసాపురం ప్రాంతాల్లో సోమవారానికి మరింత తగ్గింది. పుష్కరఘాట్‌లు బయట పడుతున్నాయి. గోదావరిలో పడవల రాకపోకలు మొదలయ్యాయి. మాధవాయిపాలెం-సఖినేటిపల్లి రేవుల మధ్య పంటు రాకపోకలను పునరుద్ధరించారు. తెలంగాణలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల్లో గోదావరి వరద మళ్లీ పెరుగుతోంది. సోమవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద 29.6 అడుగుల నీటిమట్టం నమోదైంది. మంగళవారం సాయంత్రానికి 43 అడుగులకు చేరే అవకాశం ఉందని తెలంగాణ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఉప్పుటేరుకు శాశ్వత పరిష్కారం

» ఆ దిశగా సీఎం చంద్రబాబును కలుస్తాం
» కేంద్ర మంత్రి వర్మ, ఎమ్మెల్యేలు కామినేని, రఘురామ
» డ్రెయిన్ జేఈని సత్కరించిన జిల్లా కలెక్టర్ నాగరాణి


మందపాడులో నీట మునిగిన వరిని పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి వర్మ

ఆకివీడు రూరల్, సెప్టెంబరు 9 : ఉప్పుటేరుకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీనివాసవర్మ అన్నారు. ఆకివీడు మండలం ఉప్పుటేరు, సిద్దాపురం, కళింగపాలెం, కోళ్లపర్రు గ్రామాల్లో ఆయన పర్యటించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముంపు వచ్చినప్పుడు తాత్కాలిక చర్యలు తీసుకోవడం, తర్వాత వదిలేయడం కాకుండా, ఉప్పుటేరు ప్రక్షాళన చేసి ప్రజలకు, రైతులకు ఇబ్బందులు లేకుండా చేసేందుకు ఎమ్మెల్యేలతో కలిసి సీఎం దృష్టికి తీసుకెళతానన్నారు. కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. బీజేపీ నాయకులు కోరా రామ్మూర్తి, సుభాష్, యర్రా రఘు, కర్రెడ్డి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుటేరు ముంపుపై చర్యలు : కలెక్టర్

ఉప్పుటేరు ముంపు బారిన పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ నాగరాణి తెలిపారు. ఆకివీడు మండలం దుంపగడప వద్ద ఉన్న ఉప్పుటేరులో లాంగ్‌స్టిక్ కలిగిన ప్రొక్లెయిన్‌తో కిక్కస తొలగింపు పనులను ఉండి, కైకలూరు ఎమ్మెల్యేలు రఘురామకృష్ణరాజు, కామినేని శ్రీనివాస్, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీలతో కలిసి పరిశీలించారు. నీటి ప్రవాహం పెరిగిందని, మిగిలిన కిక్కస కూడా తొలగిస్తే మరింత పెరిగి ముంపు ప్రమాదం తప్పుతుందని అన్నారు. ఇంకో ప్రొక్లెయిన్ తీసుకువచ్చి తొలగింపు చేపడతామని ఎమ్మెల్యేలు తెలిపారు. శాశ్వత పరిష్కారానికి సీఎం దృష్టికి తీసుకెళతామని వారివురు తెలిపారు. వారం రోజుల నుంచి రైల్వే వంతెన వద్ద ఉండి తూడు, కిక్కస తొలగింపునకు కృషి చేసిన డ్రైనేజీ జేఈ వెంకటేశ్వరరావును కలెక్టర్ సన్మానించారు. సిద్దాపురం, కళింగపాలెం, చినిమిల్లిపాడు గ్రామాలలో ఎమ్మెల్యే రఘురామతో కలిసి పర్యటించారు. జేసీ రాహుల్‌కుమార్, ఆర్డీవో అంబరీష్, డీపీవో, డీఎంహెచ్‌వో ఏఎంసీ మాజీ ఛైర్మన్ మోటుపల్లి రామవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఉప్పుటేరు వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యేలు రఘురామకృష్ణంరాజు, కామినేని, ఎస్పీ అస్మి

మిగిలింది.. 20 రోజులే

» కంపోస్టు యార్డుకు స్థల సేకరణ చేపట్టి నాలుగేళ్లు
» నేటికీ రైతులకందని పరిహారం.. నెలాఖరే గడువు
» లేని పక్షంలో అదనంగా కోటి చెల్లించాలి



నరసాపురం, సెప్టెంబరు 9 : కంపోస్టు యార్డుకు భూములు ఇచ్చిన రైతులకు నాలుగేళ్లయినా పురపాలక సంఘం నష్టపరిహారం చెల్లించలేదు. ఒప్పందం ప్రకారం నెలాఖరుతో గడువు ముగుస్తుంది. లేని పక్షంలో ఒప్పందం ప్రకారం పెరిగే రిజిస్ట్రేషన్ ఛార్జీల ధరలకు అనుగుణంగా రైతులకు అదనంగా రూ.కోటి పరిహారం చెల్లించాలి. గడువుకు 20 రోజులు మాత్రమే సమయం ఉంది. ప్రభుత్వం నుంచి ఇంత వరకు స్పందన లేదు.


నరసాపురం పట్టణానికి కంపోస్టుయార్డు పెద్ద సమస్య స్థలం లేకపోవడంతో గోదావరి ఒడ్డునే చెత్తను వేస్తున్నారు. రోజుకు 31 వార్డుల నుంచి 30 టన్నుల చెత్త పడేస్తున్నారు. దీనివల్ల నదీ జలాలు కలుషితం అవుతున్నాయి. పరిసర ప్రాంత ప్రజల దుర్వాసన భరించలేక నివాసం ఉండలేని పరిస్థితి. దీనిపై అనేక ఆందోళనలు జరిగాయి. చివరికి ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు మునిసిపాల్టీ నాలుగేళ్ల క్రితం పట్టణానికి శివారున వున్న మంగళగుంటపాలెంలో నాలుగు ఎకరాల ఎకరాల వ్యవసాయ భూమిని గుర్తించింది. రైతులను ఒప్పించి మరి తీసుకున్నారు. అయితే ఇంత వరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. దీంతో రైతులు కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. ఒప్పందం ప్రకారం రైతులకు రూ.3.50 కోట్లు చెల్లించాలి. దీనికి సంబంధించి మునిసిపాల్టీ దగ్గర 12వ ఆర్థిక సంఘం నిధులు, స్టేట్ ఫైనాన్స్ నిధులు రూ.1.71 కోట్లు ఉన్నాయి. ఇవి కాకుండా ప్రభుత్వం నుంచి రూ.1.79 కోట్లు రావాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలోనే ఈ ప్రతిపాదనలు పంపించారు. స్పందన లేదు. ప్రభుత్వం మారడంతో ఇటీవల బదిలీ అయినా కమిషనర్ వెంకటేశ్వరరావు మునిసిపల్ ఉన్నతాధికారులను కలిసి సమస్యను వివరించారు. రైతులతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఈ నెలాఖరులోపు పరిహారం రూ.1.79 కోట్లు ఇవ్వాలని కోరారు. సెప్టెంబరుతో గడువు ముగుస్తుందని, ఒప్పందం ప్రకారం పెరిగిన భూముల ధరలకు అనుగుణంగా రైతులకు అదనంగా కోటి చెల్లించాల్సి ఉంటుందని నివేదించారు. ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదు. మరోవైపు రైతులు ప్రభుత్వం నుంచి ఇంత వరకు సొమ్ము రాకపోవడంతో భూములను తిరిగి తీసుకునే ఆలోచనలో పడ్డారు. ఇదే జరిగితే మళ్లీ పురపాలకానికి కంపోస్టు యార్డుకు స్థలం దొరకడం పెద్ద గగనమే అన్న వాదనలు వినిపిస్తున్నాయి.

వైసీపీలో చిచ్చు

తాడేపల్లిగూడెంలో భగ్గుమన్న విభేదాలు

» జగన్ వద్ద ఓ మహిళా ప్రజా ప్రతినిధి పంచాయితీ
» తనకు జరిగిన అన్యాయంపై పార్టీ అధినేతకు ఏకరవు
» మాజీ మంత్రి కొట్టుకు దూరమవుతున్న పార్టీ కేడర్

(భీమవరం-ఆంధ్రజ్యోతి)



తాడేపల్లిగూడెం వైసీపీలో విభేదాలు భగ్గుమంటున్నాయి. నియోజకవర్గం నేతలకు, పార్టీ శ్రేణులకు పొసగడం లేదు. వైసీపీ ఘోర ఓటమి తర్వాత కేడర్ చెల్లాచెదురైంది. వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సమావేశాలు ఏర్పాటు చేశారు. అది కూడా తాడేపల్లిగూడెం, నర్సాపురం, ఆచంట వంటి నియోజకవర్గాల్లోనే సమీక్షించారు. వీటి తర్వాత పార్టీలో లుకలుకలు మొదలై శ్రేణులు వర్గాలుగా చీలిపోయారు. గడిచిన ఐదేళ్లలో పదవులను అనుభవించి, తమకు కనీస ప్రాధాన్యం ఇవ్వలేదంటూ కార్యకర్తలు కారాలు మిరియాలు నూరారు. జిల్లాలో ఒక్కొక్క నియోజకవర్గంలో ఇటువంటి విభేదాలు బహిర్గతమవుతున్నాయి. వర్గపోరులో తాడేపల్లిగూడెం కాస్త ముందుంది. ఇటీవల మాజీ సీఎం రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాలను వేర్వేరుగా నిర్వహించారు. మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ, పది మంది నాయకులతో పోలీస్ ఐల్యాండ్ వద్ద కార్యక్రమాన్ని చేపట్టారు. వైసీపీ పట్టణాధ్యక్షుడు గుండుగోగుల నాగు ఏఎంసీలో వైఎస్ విగ్రహం వద్ద నిర్వహించారు. ఆ తర్వాత సోషల్ మీడియాలో విభేదాలతో కూడిన పోస్టింగులు ఊపందుకున్నాయి. అప్పడా మాజీ వైస్ ఛైర్మన్ వడ్డీ రఘురామనాయుడుతోపాటు మండల పరిషత్, జడ్పీటీసీ పదవులు అనుభవిస్తున్న వారు కొట్టుకు దూరంగా ఉంటున్నట్లు చర్చ జరుగుతోంది.

మహిళా ప్రజా ప్రతినిధికి ఎంత కష్టం

నియోజకవర్గంలోని ఒక మహిళా ప్రజా ప్రతినిధి జగన్ వద్దే నేరుగా పంచాయితీ పెట్టారు. స్థానిక సంస్థల ఎన్నికలలో ఆమెను బరిలో నిలపాలని నిర్ణయించారు. రిజర్వేషన్‌ల ప్రక్రియ జాప్యంతో ఎన్నికలు వాయిదాపడ్డాయి. ఆ తర్వాత ఆమె భర్త, కుమారుడు చనిపోయారు. మరో బిడ్డ విదేశంలో ఉన్నారు. దీంతో సదరు నాయకురాలు ఎన్నికల బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపలేదు. తొలుత ఎన్నికల వ్యయం కోసం రూ.35 లక్షలు ఇస్తామని మహిళ భర్త నియోజకవర్గ నాయకత్వానికి హామీ ఇచ్చారు. అటు భర్త, ఇటు కుమారుడిని కోల్పోవడంతో ఆమె పోటీకి నిరాకరించారు. అయితే ఆ నేత ఒత్తిడితో బరిలో నిలిచారు. ఎన్నికల వ్యయం కోసం ఆమె నుంచి రూ.20 లక్షలు తీసుకున్నారు. మిగిలిన 15 లక్షలకు ఖాళీ చెక్కులు ఇవ్వాల్సి వచ్చింది. ఎన్నికలలో నెగ్గారు. కానీ రూ.15 లక్షలు ఇవ్వలేనంటూ ఆమె స్పష్టం చేశారు. ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూ వేడుకున్నారు. దీంతో ఆ నేత మిన్నకుండిపోయారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఫలితాలు తారుమారయ్యాయి. తాడేపల్లిగూడెంలో వైసీపీ ఘోర ఓటమి చవిచూసింది. ఈ క్రమంలోనే ఆ నాయకురాలి ఖాళీ చెక్కులు తెరపైకి తీశారు. పెంటపాడు మండల నాయకునితో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. చెక్కులు బౌన్స్ అయ్యాయి. మండల నాయకుని అనుకూలంగా తీర్పు వచ్చింది. మహిళా నాయకురాలు షాక్ తిన్నారు. మోసపోయానని గుర్తించారు. జగన్ వద్దకు వెళ్లి బోరున విలపించారు. కుటుంబాన్ని కోల్పోయి బాధల్లో వున్న తనకు నియోజకవర్గ నాయకత్వం నుంచి ఎదురైన ఇబ్బందులను జగన్ వద్ద ఏకరవు పెట్టారు. ఈ వ్యవహారాన్ని విన్న జగన్ నిర్ఘాంతపోయారు. దీనిపై నియోజకవర్గ నాయకుడితో మాట్లాడినట్లు సమాచారం.

కూటమి నాయకుని చొరవెందుకో

వైసీపీకి చెందిన మహిళా ప్రజా ప్రతినిధిని కూటమి నాయకులు ఫోన్‌లో సంప్రదించారు. వైసీపీ మండల నాయకునితోపాటు, ప్రజాప్రతినిధి వస్తే సమస్య పరిష్కరిస్తామని అన్నట్లు చెబుతున్నారు. అయితే ఆ ప్రజాప్రతినిధి కూటమి నాయకుని ప్రతిపాదనను దాటవేశారు. దీంతో వ్యవహారం యధావిధిగానే ఉంది. ఇది నియోజకవర్గంలో ఇప్పుడు కాక పుట్టిస్తున్నది. మహిళా ప్రజా ప్రతినిధికి ఇబ్బందులు గురిచేసిన నియోజకవర్గ నాయకత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు. ఇలా ఎందరో నాయకులు బయటకు వస్తున్నారు. జువ్వలపాలెం ప్రాంతానికి చెందిన వైసీపీ నాయకులు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. 2019 ఎన్నికలలో వైసీపీ విజయానికి కష్టపడిన తర్వాతే పనిమీద వెళితే రూ.10 లక్షలు కమీషన్ తీసుకున్నారంటూ ఇప్పుడా నాయకుడు మదనపడుతున్నాడు. పట్టణాధ్యక్షుడు సైతం దూరమయ్యారు. వైసీపీ సానుభూతిపరులైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నియోజకవర్గ నాయకత్వానికి దూరంగా ఉంటున్నారు. కొందరు ప్రజా ప్రతినిధులు కూటమి ప్రభుత్వానికి దగ్గరయ్యే విధంగా చూస్తున్నారు. ఎన్నికల ముందే వైసీపీకి చెందిన అనేక మంది మాజీ మంత్రి అనుచరులు టీడీపీ, జనసేనల్లో చేరిపోయారు. ఇప్పుడు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు వైసీపీకి దూరంగా ఉంటూ వస్తున్నారు.

సమస్యలుంటే రండి.. యువనేత పోస్టు

నియోజకవర్గ నాయకత్వంపై కేడర్‌లో నమ్మకం సడలి మాజీ మంత్రి కొట్టు వద్దకు కాకుండా ఇతర నేతల వద్దకు వెళుతున్నారు. ఇది తెలిసిన యువనేత సమస్యలుంటే పరిష్కారం కోసం మాజీ మంత్రి వద్దకే రావాలంటూ ఇటీవల సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. అయినా సరే కేడర్‌లో స్పందన లేదు. పార్టీ శ్రేణులు వేరేదారులు వెతుక్కుంటున్నాయి. తమ అనుచరులకు ఉద్యోగాలు పోతాయనుకుంటే కూటమిలోకి పంపుతున్నారు. ఉద్యోగాలను కాపాడుకుంటున్నారు. ఈ నేత వద్దకు వెళ్లడానికి ససేమిరా అంటున్నారు. గత అయిదేళ్లలో నియోజకవర్గ నాయకత్వానికే అన్ని ప్రయోజనాలు సమకూరాయి. తమకు ఒరిగింది ఏమీ లేదని కస్సుబుస్సులాడుతున్నారు.

నరసాపురంలోనూ విషపు ఈగల పుట్ట




నరసాపురం, సెప్టెంబరు 9: ఇప్పటి వరకు గ్రామాలకే పరిమితమైన విషపు ఈగల పుట్టలు పట్టణంలోను దర్శనమిస్తున్నాయి. తాజాగా నరసాపురం 15 వార్డు దర్గాలోని ఓ చెట్టుపై ఈ పుట్టను గుర్తించారు. కొన్ని రోజుల నుంచి ఉంటున్న ఈ పుట్టను పెద్దగా పట్టించుకోలేదు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తను చూసి ఒక్కసారి భయందోళన చెందారు. దర్గాలోని చెట్టుపై మట్టి పుట్ట ఉందని సమాచారం ఇచ్చారు. ఇవి కుడితే జరిగే ప్రమాదాన్ని తెలుసుకున్న స్థానికులు అటువైపు వెళ్లేందుకు ఆందోళన చెందుతున్నారు. పుట్టల సమాచారాన్ని అధికారులకు తెలియజేశారు. ఇటీవల రుస్తుంబాద ఈ తరహా పుట్టను తొలగించిన నిపుణులైన కార్మికులను రప్పించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు.

అందుబాటులో ఇసుక రవాణా చార్జీలు

భీమవరం టౌన్, సెప్టెంబరు 9 : ఉచిత ఇసుకను వినియోగదారునికి సరసమైన రవాణా చార్జీలతో అందించేందుకు టిప్పర్లు, లారీలు యజమానులు సహకరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ జిల్లాలోని టిప్పర్లు, లారీ ఓనర్స్ అసోసియేషన్స్‌తో సమావేశమై ఉచిత ఇసుక రవాణా చార్జీలను సమీక్షించారు. 'జిల్లాలో ప్రస్తుతానికి ఇసుక అందుబాటులో లేదు. బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల నుంచి అందుబాటులో వున్న ఇసుకను పొందేందుకు అవకాశం ఉంది. సమీక్షలో కిలో మీటరుకు రవాణా చార్జీలను నిర్ణయించి ప్రభుత్వ ఆమోదానికి పంపించాం. అనుమతి రాగానే అమలు చేస్తాం' అని తెలిపారు. సమావేశంలో జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, డీఆర్వో జె.ఉదయభాస్కరరావు, జిల్లా రవాణా అధికారి పి.ఉమామహేశ్వరరావు, జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి జి.జయ ప్రసాద్, పూర్వపు పశ్చిమ జిల్లా టిప్పర్స్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రావోయి రాజా తదితరులు పాల్గొన్నారు.

అంగర రూ. 5 లక్షల విరాళం


సీఎం చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 9: విజయ వాడ వరద బాధితుల కు తన వంతు సాయంగా రూ.5 లక్షలు అందజేసినట్టు మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ తెలిపారు. విజయవాడ కలెక్టరేట్‌లో సీఎం చంద్రబాబును కలిసి చెక్కును అందించారు. బుడమేరు గండి పడిన ప్రాంతానికి వెళ్లి పనులు పర్యవేక్షిస్తున్న రాష్ట్ర మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడును, మాజీ మంత్రి దేవినేని ఉమను కలిసి వరద పరిస్థితులు తెలుసుకున్నారు. ఆయన వెంట టీడీపీ జిల్లా అధ్యక్షుడు రామరాజు, పాలకొల్లు నియోజకవర్గ నాయకులు ఉన్నారు.

జై జై గణేశా..!



పెంటపాడు మండలం అలంపురం టీబీఆర్ స్కూల్ వద్ద ఆరు చేతుల గణపతి

భీమవరంలో పెన్నులతో గణపతికి అలంకారం..


సిద్ధాంతంలో గణనాథుడిని నిమజ్జనం చేసేందుకు ఊరేగింపు


విస్సాకోడేరులో 14 అడుగుల త్రిముఖ గణనాథుడు

-7లో..

ఒక్క క్షణం.. ఆగండి
క్షణికావేశంలో నిర్ణయాలు వద్దు -7లో

కారు నుంచి అకస్మాత్తుగా మంటలు..



భీమడోలు, సెప్టెంబరు 9 : కొవ్వూరు-గుండుగొలను నూతన జాతీయ రహ దారిపై సోమవారం రాత్రి 8 గంటల సమయంలో మంటల్లో చిక్కుకుని కారు దగ్ధమైంది. భీమడోలు మండలం పోలసానపల్లి సమీపంలో కారులో ఒక్క సారిగా మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. రాజమండ్రి నుంచి విజయ వాడ వెళ్తున్న ఈ కారులో ఇద్దరు ప్రయాణిస్తున్నారు. భీమడోలు ఎస్‌ఐ సుధా కర్ అగ్నిమాపక అధికారులకు సమాచారం అందజేసి ట్రాఫిక్ నియంత్రించారు. ప్రయాణిస్తున్నవారు అప్రమత్తం అవడంతో పెను ప్రమాదం తప్పింది.



జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ ప్రారంభిస్తున్న వీసీ

అరటిలో విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 9: అరటిలో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇవ్వడం ద్వారా లాభసాటి శిక్షణ అవసరమని ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఆవరణలోని కృషి విజ్ఞాన కేంద్రం వద్ద అరటినారు తీయుట, నారు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై ఐదురోజుల శిక్షణా కార్యక్రమం సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ కరుణశ్రీ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, నాబార్డ్ డీడీఎం అనిల్‌కాంత్, తదితరులు పాల్గొన్నారు.

నేడు జరగాల్సిన స్కూల్ గేమ్స్ వాయిదా

పెదవేగి, సెప్టెంబరు 9 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాస్థాయి క్రీడాజట్ల ఎంపిక పోటీల్లో భాగంగా 10వ తేదీ మంగళవారం జరగాల్సిన ఎంపిక పోటీలను వర్షం, వరదల కారణంగా వాయిదా వేశామని అండర్ 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి, పెదవేగి గురుకుల విద్యాలయం పీడీ కందికొండ జయరాజు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు సంబంధించిన హైస్కూల్, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు ఈనెల 6వ తేదీ శుక్రవారం నుంచి 21వ తేదీవరకు జరిగే స్కూల్ గేమ్స్‌లో భాగంగా శుక్రవారం ఎంపిక పోటీలు పూర్తయ్యాయని, కాగా పదవ తేదీన జరగాల్సిన పోటీలను వరదల కారణంగా రహదారులు ధ్వంసం కావడంతో రాకపోకలకు ఇబ్బందులు ఉంటాయనే ఆలోచనతో వాయిదా వేశామని, మిగిలిన పోటీలు ముందుగా ప్రకటించిన ప్రకారం ఈ నెల 21వ తేదీ సోమవారం వరకు యధాతథంగా జరుగుతాయని తెలిపారు. ఇప్పటికే వాయిదాపడిన 4వ తేదీ పోటీలతో పాటు తాజాగా వాయిదా వేసిన 10వ తేదీన జరగాల్సిన పోటీలు ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియపర్చుతామని జయరాజు తెలిపారు.

ఎంపిక పోటీలు వాయిదా

ఏలూరు రూరల్, సెప్టెంబరు 9: ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఈనెల 11వ తేదీన జరగాల్సిన అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు వర్షాల కారణంగా వాయిదా వేసినట్లు ఏలూరు డిస్ట్రిక్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి దేవరపల్లి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో ఎంపిక పోటీలు నిర్వహించే తేదీని ప్రకటిస్తామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు

గర్భ స్రావాలను తగ్గించాలి : డీఎంహెచ్‌వో

భీమవరం టౌన్, సెప్టెంబరు 9 : జిల్లాలో సాధ్యమైనంత వరకు గర్భస్రావాలను తగ్గించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు సూచించారు. సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా ఎంటీపీ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. తల్లికిగానీ, బిడ్డకు గానీ ప్రమాదం ఉన్నదని తెలిసిన సందర్భాల్లో మాత్రమే చట్టంలో పేర్కొన్న నియమ నిబంధనలకు లోబడి మాత్రమే అబార్షన్లు నిర్వహించాలన్నారు. ఎక్విప్మెంట్ నిర్వహణ సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రతీ నెల రిపోర్టులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాయలయానికి తప్పనిసరిగా పంపించాలన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ ఇర్రింకి లక్ష్మి, డాక్టర్ చింతి ఆనంద్, జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సుధాలక్ష్మి, డిప్యూటి డెమూ అనంతలక్ష్మి, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ వీఎస్ ఆర్‌కె కుమారి తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలో నమోదైన దృశ్యాలు

జంగారెడ్డిగూడెంలో మేకల చోరీలు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 9 : జంగారెడ్డిగూడెం పట్టణం, మండలంలోను వరుస మేకల చోరీలు జరుగుతున్నాయి. సెప్టెంబరు రెండో తేదీ సోమవారం అర్థరాత్రి ఇందిరానగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల వద్ద మటన్ వ్యాపారి షేక్ పీరు సాహెబ్ ఇంటి వద్ద మేకల దొడ్డిలో ఉన్న రూ.లక్షా ఇరవై వేలు విలువ చేసే ఆరు మేక పోతులను గుర్తుతెలియని నలుగురు దుండగులు తీసుకువెళ్లిపోయారురు. మేకల దొడ్డిలో ఏర్పాటు చేసిన సీసీ కెమేరా ద్వారా దొంగతనం జరిగిందని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆ తర్వాత రోజు బుధవారం మండలంలోని మైసన్నగూడెం గ్రామానికి చెందిన పంపన వెంకట్రావుకు చెందిన రూ.లక్షా ఇరవై వేల విలువ చేసే రెండు గొర్రె పోతులు, రెండు మేకపోతులు, మూడు మేకలను గుర్తు తెలియని దుండగులు దొంగిలించుకుపోయారు. ఈయన కూడా జంగారెడ్డిగూడెం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

దళారుల దోపిడీకి
ఆక్వా రైతు బలి

- ఆరుగాలం కష్టం, పెట్టుబడి దోచుకుంటున్న వైనం
- కోట్లలో ఎగనామం
- రోడ్డున పడుతున్న ఆక్వా రైతు కుటుంబాలు





భీమవరం క్రైం, సెప్టెంబరు 9 : ఆక్వా చెరువులు, రొయ్యలు, చేపలు ఎగుమతులు, కోట్లలో వ్యాపారానికి పెట్టింది పేరు పశ్చిమ గోదావరి జిల్లా. చాలా మంది రైతులు, వ్యాపారులు ఆక్వా వ్యాపారంపైనే ఆధారపడుతూ ఉంటారు. అలా రోజుకు వందల కోట్లు చేతులు మారుతూ ఉంటాయి. ఇంత వరకు బాగానే ఉన్నా కొన్ని సంవత్సరాలుగా చేపలు, రొయ్యల రైతులు ఆరుగాలం కష్టపడి, లక్షల్లో పెట్టుబడులు పెట్టి చేపలు, రొయ్యలను పండిస్తే చివరకు కొంతమంది దళారుల చేతుల్లో మోసపోతున్నారు. దళారులు మాత్రం కొంతకాలం తమకు డబ్బులు రాలేదని చెబుతూ తిరుగుతూ మళ్ళీ యథావిధిగా బెంజ్ కార్లలో తిరుగుతూ ఎంజాయ్ చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు ఎక్కువగా భీమవరం ప్రాంతంలో గత పది సంవత్సరాల కాలంలో పది వరకు జరిగాయంటే రైతులు ఏవిధంగా మోసపోతున్నారో అర్థం చేసుకోవచ్చు.

నగదు భేరానికి ధర తక్కువ

చేపలు, రొయ్యలు పండించిన సరుకును అమ్మకానికి దళారులతో ముందుగా మాట్లాడతారు. తాము ఫలానా కంపెనీకి సరుకు విక్రయిస్తామని వారు రైతులను నమ్మబలికిస్తారు. అలాగే కంపెనీలు ముందుగానే సొమ్ములు చెల్లించినా కూడా దళారులు మాత్రం క్యాష్ భేరం అయితే ధర తక్కువ, అరువు అయితే ధర ఎక్కువ చెబుతారు. దీంతో రైతులు ఆ సొమ్ములకు ఆశపడి అరువు భేరానికి సరుకును అమ్ముతారు. దీంతో దళారి ముందుగా క్యాష్ చేసుకుని రైతులను మాత్రం నట్టేట ముంచుతారు. ఇలాంటి తరహా మోసాలు చాలానే చోటు చేసుకున్నాయి. గత పదేళ్ళలో భీమవరం చుట్టుప్రక్కల సుమారు రూ.500 కోట్లు వరకు రైతులు నష్టపోయినట్లుగా తెలుస్తుంది.

- సుమారు ఐదు సంవత్సరాల క్రితం భీమవరం పట్టణానికి చెందిన ఒక దళారి రైతులు వద్ద నుంచి రొయ్యల కొనుగోలు చేసి సొమ్ములు ఇవ్వకుండా తనకు పైనుంచి సొమ్ములు రావాలంటూ రూ.20 కోట్లు వరకు మోసం చేశాడు. ఒక సంవత్సరం అనంతరం ఆ దళారి డూప్లెక్స్ ఇంటిని నిర్మించుకుని సంతోషంగా ఉన్నాడు.
- కొంత కాలం క్రితం భీమవరం రెస్ట్‌హౌస్ రోడ్డుకి చెందిన ఒక రొయ్యల వ్యాపారి రూ.10 కోట్లు వరకు రైతులను మోసం చేశాడు. తను మాత్రం బెంజ్ కార్లలో తిరుగుతున్నాడు. రైతులను నట్టేట ముంచాడు.
- ఇటీవల భీమవరం రెండవ పట్టణానికి చెందిన ఒక రొయ్యల వ్యాపారి సుమారు రూ.35 కోట్లు వరకు రైతులకు ఎగనామం పెట్టాడు. ఎన్నికలు జరిగినప్పటి నుంచి ఎవ్వరికి కనబడకుండా వెళ్ళిపోయాడు. రైతులు మాత్రం అతని ఇంటి చుట్టూ తిరుగుతున్నారు.
- భీమవరం రెండవ పట్టణానికి చెందిన ఒక వ్యాపారి సుమారు 10 రోజుల క్రితం ఏకంగా రూ.80 కోట్లు వరకు బకాయిలు పెట్టి ఐపి పెట్టినట్లుగా చెబుతున్నారు. రైతులు మాత్రం ఉన్న కొద్దిపాటి ఆస్తులను అమ్ముకుని అప్పులను తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.
- భీమవరం ఒకటవ పట్టణానికి చెందిన ఒక వైసీపీ నాయకుడు చేపల వ్యాపారి సుమారు రూ.12 కోట్లు వరకు రైతులకు బకాయిలు పెట్టాడు. గతంలో రూ.6 కోట్లు వరకు పెట్టడంతో ఒక ప్రజాప్రతినిధి అండతో ఎగ్గొట్టాడు. మళ్ళీ ఇప్పుడు సుమారు రూ.6 కోట్లు వరకు బకాయిలు ఉండటంతో రైతులు ఇంటికి ఇటీవల వెళ్ళగా తనను కిడ్నాప్ చెయ్యడానికి వచ్చారు అంటూ పోలీసులకు ఫోన్ చేసి చెప్పడంతో పోలీసులు కూడా అక్కడకు చేరుకున్నారు. ఇలా దళారులు చేతుల్లో రైతులు మోసపోతూనే ఉన్నారు.



చంద్రబాబుకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందిస్తున్న సింగపూర్ ప్రవాస తెలుగు వాసులతో ఎమ్మెల్యే ఆరిమిల్లి

వరద బాధితులకు ఎన్ఆర్ఐలు 17.50 లక్షల సాయం

తణుకు/ కొయ్యలగూడెం/ కామవరపుకోట సెప్టెంబరు 9: విజయవాడ వరద బాధితుల కోసం మానవీయతను చాటిన సింగపూర్‌లో ఉంటున్న ప్రవా సాంధ్రులను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అభినందించారు. సోమవారం విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో సింగపూర్‌లో ఉంటున్న బొబ్బా రాజా చౌదరి, రాధిక ప్రసాద్ ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే ఆరిమిల్లితో కలసి 17 లక్షల 50 వేల రూపాయలు చెక్కు అందజేశారు. ఎన్ఆర్ఐ పారేపల్లి సతీష్‌కుమార్ మాట్లాడుతూ విపత్కర తరుణంలో చంద్రబాబు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని బాధితులకు తమవంతు సహకారం అందిస్తున్నానని చెప్పారు. సతీష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో వాషింగ్ మిషన్ల ఏర్పాటు

నూజివీడు టౌన్, సెప్టెం బరు 9: విద్యార్థుల సౌక ర్యార్థం నూజివీడు ట్రిపుల్ ఐటీలో హాస్టల్‌కు రెండు చొప్పున వాషింగ్ మిషన్లను ఏర్పాటు చేశారు. హైయర్ స్మార్ట్ సొల్యూషన్స్ తరఫున ఈ వాషింగ్ మిషన్లను ఏర్పాటు చేయగా ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ బి.చంద్రశేఖర్ విద్యార్థులకు అందించారు. హైయర్ సంస్థ మేనేజర్ ఎన్.మనోజ్ మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకమైన విద్యా సంస్థల్లో ఇప్పటి వరకు 3 వేల వాషింగ్ మిషన్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులు వాటిని పేఅండ్ యూజ్ ద్వారా వాడుకోవాలని, దివ్యాంగులకు మాత్రం ఉచితం అన్నారు. ఏవో జి.లక్ష్మణరావు, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ బ్రహ్మాస్వాములు, దుర్గా భవాని పాల్గొన్నారు.

గణనాయకా..నమోస్తుతే



ఏలూరు తంగెళ్లమూడిలో నాట్య గణపతి



పెనుమదం అగస్త్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భారీ మట్టి వినాయకుడు

వినాయక చవితి సందర్భంగా మండపాల్లో కొలువు దీరిన గణనాథులు పూజలందుకుంటున్నారు. సోమవారం మూడో రోజు పలు ప్రాంతాల్లో గణపతి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు..



ద్వారకాతిరుమల కొప్పెట్టివారి వీధిలో నెలకొల్పిన భారీ గణపతి

ఒక్క క్షణం..ఆగండి



ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలు
క్షణికావేశంలో నిర్ణయాలు
ఆలోచిస్తే సమస్యకు పరిష్కారం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 9: పూర్వం ఉమ్మడి కుటుంబాల్లో అందరూ కలిసిమెలసి ఆనందంగా జీవించేవారు. ఏ సమస్య వచ్చినా మేమున్నా మంటూ మిగిలిన కుటుంబ సభ్యులంతా భరోసా ఇచ్చే వారు. కాలం మారిపోయింది. మనిషి సుఖవంతమైన జీవితం కోసం వస్తువుల వెంటపడ్డాడు. ఉమ్మడి కుటుంబాల నుంచి బయటకు వెళ్లిపోయాడు. జీవితం యాంత్రికంగా మారిపోయింది. క్షణం తీరిక లేకుండా ఒత్తిడికి గురవుతున్నారు. సమస్య వస్తే చెప్పుకునే వారు లేకుండాపోయారు. క్షణికావేశంలోనే ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఒంటరి తనం, అనారోగ్యం, అప్పులబాధ, ప్రేమ విఫలం, భార్యాభర్తల మధ్య మనస్పర్థలు, కట్నం వేధింపులు వంటి కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి ఏటా

సెప్టెంబరు 10న..ఆత్మహత్యల నివారణ దినోత్సవం

నిర్వహిస్తున్నది. ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడానికి 2003 నుంచి ఈ కార్యక్రమాన్ని చేపట్టింది.

యువకులే ఎక్కువ

ఆత్మహత్యలు చేసుకునేవారిలో యువకులే ఎక్కువ మంది ఉంటున్నారు. అమ్మనాన్నలతో ఆనందంగా గడిపి ఆ తరువాత హాస్టల్‌లో గడపాలంటే అక్కడ ఒంటరి తనానికి గురై ఒత్తిళ్ళకు లోనై చివరకు ఆత్మహత్యే శరణ్యమంటూ ప్రాణాలు తీసేసుకుంటున్నారు. ఆత్మహత్యలు చేసుకునే వారిలో పురుషులే ఎక్కువ మంది ఉంటున్నారు. చెడు వ్యసనాలకు బానిసలై ఆర్థికంగా ఇబ్బందులు పడ్డ వారు కొంతమంది కాగా స్థాయికి మించి అప్పులు చేసి తీర్చే మార్గం లేక సమాజంలో పరపతి పోతుందనే భయంతో ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఎంత చదివినా విద్యలో రాణించలేక పోతున్నానని మనస్థాపానికి గురై ప్రాణాలు విడుస్తున్నారు..

సగటున నెలకు 53 మంది..

ఏలూరు జిల్లాలో వివిధ కారణాలతో ఏడాదికి 600 మందిపైబడి ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. వారి కుటుంబాలు తీరని విషాదానికి గురై చీకటిమయంలో జీవిస్తున్నారు. పోలీస్ స్టేషన్లలో నమోదైన రికార్డుల ప్రకారం 2020లో 661 మంది, 2021లో 682 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. 2022లో 678 మంది, 2023లో 639 మంది, ఈ ఏడాది ఇప్పటి వరకూ 335 మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు. సగటున నెలకు 53 మంది తమ ప్రాణాలను బలవంతంగా విడిచిపెడుతున్నారు..



ఉన్నది ఒక్కటే జీవితం.. ఆనందంగా గడపాలి..



ఆత్మహత్య ఫలానావారే చేసుకుంటారని ఏమీ ఉండదు. పేదవాడి నుంచి ధనవంతుడి వరకూ చిన్నవారి నుంచి వృద్ధుల వరకూ ఏ క్షణమైనా ఈ ఆలోచన రావచ్చు. మానసికంగా వ్యధకు లోనైనవారు కుటుంబ సభ్యులతో సరిగా మాట్లాడకపోవడం, ప్రతిదానికి కోపగించుకోవడం, సరిగా భోజనం చేయక పోవడం, మతిమరుపు, నిద్రపోకపోవడం, ఒంటరిగా గడపాలని కోరుకోవడం, భయం భయంగా ఉండడం వంటి లక్షణాలు ఉంటాయి. ఇలాంటి వాటిని గుర్తించి వెంటనే కుటుంబ సభ్యులు ఆప్యాయతగా పలకరించడం, వారిపైన ప్రేమాభిమానాలు చూపించి అవసరాన్ని బట్టి మానసిక వైద్య నిపుణుల వద్దకు తీసుకువెళ్లాలి.ఆత్మహత్య అనేది సెల్ఫ్ మర్డర్. మరో జీవితం ఉందో లేదో తెలియదు. ఉన్న జీవితంలోనే ఎదురయ్యే వడిదుడుకులకు భయపడకూడదు. ఆనందంగా జీవించాలి. ఏదైనా మానసికంగా ఇబ్బందులు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

డాక్టర్ సీహెచ్ వంశీ కృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, మానసిక వైద్య నిపుణులు, ప్రభుత్వాసుపత్రి ఏలూరు

క్రైం కార్నర్..



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ.. స్వాధీనం చేసుకున్న నగదు

ఏటీఎం సెంటర్లే టార్గెట్..
కార్డులు మార్చి సొమ్ము కొట్టేస్తున్న వ్యక్తి అరెస్టు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 9 : ఏటీఎం సెంటర్లకు వచ్చే అమాయకులను, చదువురాని వారిని ఆసరా చేసుకుని మోసగిస్తున్న ఒక వ్యక్తిని కైకలూరు టౌన్ పోలీసులు అరెస్టు చేశారని ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ చెప్పారు. ఏలూరులో సోమవారం వివరాలు వెల్లడించారు. కైకలూరు మండలం సింగాపురానికి చెందిన బొల్లా వెంకటేశ్వరరావు కైక లూరులోని ఆగస్టు 5వ తేదీ ఉదయం ఏటీఎం సెంటర్‌కు వెళ్లి డబ్బులు తీసే సమయంలో అక్కడ ఒక వ్యక్తి ఉండి సహాయం చేసినట్లు నటించి ఆయన ఏటీఎం కార్డును మార్చివేశాడు. కార్డు ఉపయోగించి రూ. 46 వేలు అపహరించాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ కిషోర్ ఆదేశాల మేరకు కైకలూరు టౌన్ సీఐ కృష్ణ తన సిబ్బందితో నిఘా పెట్టారు. కైకలూరు గంధీబొమ్మ సెంటర్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా కోనసీమ జిల్లా పోలవరంలోని దంగుడు బియ్యం వారి వీధికి చెందిన పల్లా సురేంద్ర కుమార్ అలియాస్ సురేంద్ర (32) అనే యువకుడిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసినట్టు ఒప్పుకున్నాడు. కైకలూరులోనే మరో కేసులో 60,400 రూపాయలు అపహరించాడని, ఏలూరు త్రిటౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో రూ.20 వేలు ఒక మహిళ ఏటీఎం కార్డు ద్వారా తస్కరించాడని విచారణలో వెల్లడైంది. దీంతో అతన్ని అరెస్టు చేశామన్నారు. సురేంద్ర కుమార్ చెడు వ్యసనాలకు బానిసై క్రికెట్ బెట్టింగులు, జల్సాలకు అలవాటుపడి ఇలాంటి నేరాలు చేస్తున్నాడన్నారు. 2019 నుంచి ఇప్పటి వరకూ 60 పైగా కేసులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం కైకలూరు టౌన్‌లో నమోదైన రెండు కేసుల్లోనూ, ఏలూరు త్రిటౌన్‌లో నమోదైన కేసులలో మొత్తం 86,400 రూపాయల నగదు రికవరీ చేశామని వెల్లడించారు. డీఎస్పీతో పాటు కైకలూరు టౌన్ సీఐ కృష్ణ, కైకలూరు టౌన్ ఎస్ఐ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మోటారు సైకిలిస్టు మృతి



పిల్లా విష్ణు (ఫైల్)

భీమడోలు, సెప్టెంబరు 9 : మోటారు సైకిల్‌ను లారీ ఢీకొన్న ఘటనలో పిల్లా విష్ణు (35) అనే వ్యక్తి మృతి చెందినట్టు భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. భీమడోలు మండలం కురెళ్ళగూడెంలో ఉంటున్న పిల్లా విష్ణు పి.కన్నాపురం రైల్వే గేటు వద్ద వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి షాపు నుంచి ఇంటికి వస్తుండగా ఏలూరు వైపు నుంచి తాడేపల్లి గూడెం బత్తాయిపళ్ళ లోడుతో వెళ్తున్న ట్రక్కు విష్ణు మోటారు సైకిల్‌ను ఢీకొంది. అనంతరం ట్రక్కు బోల్తా పడింది. విష్ణు అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుని స్వస్థలం ఉంగుటూరు కాగా వివాహం అయిన తరువాత కురెళ్ళగూడెంలో నివాసం ఉంటున్నారు. మృతుడికి ఒక పాప ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో పసికందు మృతి
వైద్య సిబ్బందే కారణమంటూ ఆందోళన



రోదిస్తున్న బాలింత

టి.నరసాపురం, సెప్టెంబరు 9: మండలం లోని బొర్రంపాలెం ప్రభుత్వ ఆసుపత్రిలో సోమ వారం ఒక పసికందు మృతిచెందింది. బొర్రం పాలెం గ్రామానికి చెందిన బాధిత మహిళ రేఖ తెలిపిన వివరాల ప్రకారం పురిటి నొప్పులు రావడంతో ఆదివారం రాత్రి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. పరీక్షించిన వైద్యులు డెలి వరీకి సమయం పడుతుందని జాప్యం చేస్తూ వచ్చారని సోమవారం సాయంత్రం నాలుగు తర్వాత పురుడు వచ్చిందన్నారు. ఆ తర్వాత తన బిడ్డను జంగారెడ్డిగూడెం పిల్లల ఆసుపత్రికి పంపారని అప్పటికే బిడ్డ మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆమె బంధువులు ఆసుపత్రికి చేరుకుని బిడ్డ మృతికి కారణం వైద్య సిబ్బందే అని, వైద్య సహాయం అందించడంలో నిర్లక్ష్యవైఖరి వల్ల బిడ్డ మృతి చెందిందని ఆందోళనకు దిగారు.ఈ విషయమై వైద్యురాలు ఇమాంబీని ప్రశ్నించగా బిడ్డకు తల్లి కడుపులో పేగు చుట్టుకుని ఊపిరాడక మృతి చెందినట్లు తెలిపారు. అనంతరం అక్కడకు చేరుకున్న ఏఎస్ఐ జయకుమార్ వైద్య సిబ్బంది, బాధితులతో చర్చించి సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు.

ఫోన్ చూడవద్దన్నందుకు యువతి ఆత్మహత్య

కుక్కునూరు, సెప్టెంబర్లు 9: మండల పరిధిలోని గణపవరంలో జామాయిల్ నర్సరీలో పనిచేస్తున్న కొవ్వాసి పైకే (18) అనే యువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన యువతి తన అన్న, బంధువులతో కలిసి వారం రోజు క్రితం నర్సరీలోకి పనికి వచ్చింది. ఫోన్ ఎక్కువగా చూస్తూ పని సరిగా చేయకపోవడంతో అన్న మందలించి ఆమె నుంచి ఫోన్ తీసుకున్నాడు. దీంతో మనస్థాపానికి చెందిన కొవ్వాసి పైకే చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్యా వియోగం..ఆత్మహత్య

నరసాపురం, సెప్టెంబరు 9 : నరసాపురం కొత్తకాలనీలో ఈ నెల 7న బ్లేడ్‌తో పీక కోసుకొని ఆత్మహత్యాయ్నానికి ప్రయత్నించిన కె.చిన్న సోమవారం చికిత్స పొందుతూ విజయవాడలో మృతి చెందిన్నట్లు సీఐ యాదగిరి చెప్పారు. గొడవలు కారణంగా కొంతకాలంగా చిన్న భార్యకు దూరంగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తున్నట్లు సీఐ చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

భీమవరం క్రైం, సెప్టెంబరు 9 : తాళం వేసిన ఇంట్లో చొరబడి తాళాలు బద్దలు కొట్టి బంగారం, వెండి, నగదు దోచుకెళ్ళిన సంఘటన భీమవరంలో చోటు చేసుకుంది. ఆదర్శ్ నగర్‌లో నివాసం ఉండే దండు రంగరాజు ఈనెల 4వ తేదీన బెంగళూరు తన కుమార్తె వద్దకు వెళ్ళాడు. ఈ నెల 8వ తేదీన తన పక్క నివాసం ఉండే వ్యక్తి ఫోన్ చేసి ఇంటి తాళాలు బద్దలు కొట్టి ఉన్నాయని చెప్పడంతో వచ్చి చూసుకునేసరికి 20 గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండి, 50 వేలు నగదు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రెహమాన్ తెలిపారు.

ప్రకృతి నష్టాన్ని తగ్గించగలిగాం: మంత్రి వర్మ


పునరావాసులకు భోజనాలు వడ్డిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

ఆకివీడు, సెప్టెంబరు 9 : ప్రకృతి విపత్తులో ప్రజలు పూర్తిస్థాయిలో నష్ట పోకుండా నివారించగలిగామని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాలలో పునరావాసులతో సోమవారం ఆయన మాట్లాడారు. వరదలు, వర్షాలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ చర్యలు తీసుకున్నామన్నారు. జనసేన పట్టణ అధ్యక్షుడు పిల్లా బాబులు, మండల కన్వీనర్ దారపురెడ్డి కన్నబాబు ఏర్పాటు చేసిన భోజనాలు వడ్డించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి జు త్తుగ నాగరాజు, టీడీపీ మండల-పట్టణ అధ్యక్ష-కార్యదర్శులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, నౌకట్ల రామారావు, గంధం ఉమా, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కోరా రామూర్తి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం ఆదుకుంటుంది

భీమవరం టౌన్: రాష్ట్రంలో తుఫాన్, విజయవాడలో బుడమేరు ముంపువల్ల సంభవించిన నష్టాన్ని భర్తీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేయూత నిస్తుందని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ వెల్లడించారు. పార్టీ కార్యాయలంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తొలి దఫాగా తాత్కలిక సహాయాన్ని అందజేస్తారన్నారు. తరువాత వరద నష్టాల నివేదికల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం తప్పకుండా ఆర్థికసాయంతో ఆదుకుంటుందన్నారు.

నర్సయ్య అగ్రహారంలో రోడ్డు వేస్తాం

భీమవరం ఆర్టీసీ డిపో నుంచి నర్సయ్య అగ్రహారం వరకు దెబ్బతిన్న రహదారి స్థానంలో సీసీ రోడ్డు నిర్మిస్తామని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. సోమవారం ఆయన రోడ్డును పరిశీలించారు. గతంలో పలు మార్లు ఈ రోడ్డు నిర్మాణం చేపట్టినప్పటికీ రాహదారి పటిష్టత లేనందున దెబ్బతిందన్నారు. గత వైసీపీ పాలనలో వేసిన రోడ్లలో నాణ్యతాలోపం కారణంగా దెబ్బతిన్నాయని అన్నారు.

'వైసీపీ ప్రభుత్వం పేదల కడుపుకొట్టింది'

ఆకివీడు, సెప్టెంబరు 9 : అన్న క్యాంటిన్‌లు తొలగించి వైసీపీ ప్రభుత్వం పేద ప్రజల కడుపుకొట్టిందని కేంద్ర సహాయక మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. దాత గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు ఆర్థిక సహకారంతో ఏర్పాటుచేసి తొంబై రోజులు పూర్తిచేసుకున్న అన్న క్యాంటిన్‌ను సోమవారం సందర్శించి ఆయన పేదలకు భోజనాలు వడ్డించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తుగ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి తో ఎమ్మెల్యే బొలిశెట్టి సమావేశం

తాడేపల్లిగూడెం అర్బన్, సెప్టెంబరు 9: నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి చేయూత నివ్వాలని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు. ఆదివారం పట్టణంలో అపుస్మా సమావేశం ముగిసిన తరువాత బొలిశెట్టి ఆహ్వానం మేరకు మంత్రి వర్మ ఎమ్మెల్యే నివాసానికి వెళ్లారు. పట్టణం నుంచి ఎన్‌హెచ్ 16 వరకు అప్రోచ్ రహదారులు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరగా స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడారు.

నీట మునిగిన పంట పొలాలు పరిశీలన


రైతులతో ఎమ్మెల్యే నాయకర్

నరసాపురం రూరల్, సెప్టెంబరు 9: మండలంలోని మంగళగుంటపాలెంలో నీటమునిగిన పంట పొలాలను వ్యవసాయశాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే నాయకర్ పరిశీలించారు. ఇప్పటికే రెండు సార్లు వర్షాలు, వరదల కారణంగా వేసిన నారుమడులు, ఆకుమడులు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. మళ్లీ ఆకుమడులువేయాలంటే పెట్టుబడులు పెట్టాల్సి వస్తుందని రైతులు వాపోయారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మళ్లీ పంటలు వేసుకునేలా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఎకరానికి రూ.6800 పరిహారం అందేలా చూస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి, తహసీల్దార్ రాజరాజేశ్వరి, ఏవో జాన్సన్ పాల్గొన్నారు.

నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం

మొగల్తూరు,సెప్టెంబరు 9: అధిక వర్షాలతో నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ రైతులకు భరోసా ఇచ్చారు. సోమవారం మొగల్తూరులో వర్షాలకు కుళ్ళిన వరి చేలను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సార్వా సాగు సమయంలో అధిక వర్షాలతో నారు మడులు పోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై వరి విత్తనాలు ఇవ్వడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో 3వేల ఎకరాల్లో సార్వా సాగు చేపట్టగా 1617 ఎకరాల్లో పూర్తి నష్టం వాటిల్లిందని ఇందుకు ఎకరాకు 6,800లు నష్టపరిహారం అందిస్తున్నట్టు వివరించారు.

డీఎస్పీని కలిసిన టీడీపీ నాయకులు

నరసాపురం టౌన్, సెప్టెంబరు 9: ఇటీవల డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన మురళీకృష్ణను సోమవారం టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సబ్‌డివిజన్ కార్యాలయంలో ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో నాయకులు కలిసి బొకే అందించారు.

సీపీఎం రాము గుండెపోటుతో మృతి



నరసాపురం, సెప్టెంబరు 9: సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు, సీఐటీయూ కార్యదర్శి పొన్నాడ రాము (50)(బాబాయ్) సోమవారం గుండెపోటుతో మరణించారు. విశాఖపట్నంలో బంధువుల ఇంటికి వెళ్లిన ఆయనకు అక్కడ తీవ్రమైన గుండెపోటు వచ్చి కుప్పకూలారు. ఆస్పత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. దాదాపు 30ఏళ్లుగా సీపీఎంలో వివిధ పదవులు, ఉద్యమాలు చేశారు. ఆయన మృతికి పార్టీ నాయకులు మంతెన సీతారం, బలరాం, కవురు పెద్దిరాజు, టి.సత్యనారాయణ, ఎం.త్రిమూర్తులు, గోపాల్‌రాయ్ సంతాపం వ్యక్తం చేశారు.

వార్డుల్లో చైర్‌పర్సన్, కమిషనర్ పర్యటన

నరసాపురం టౌన్, సెప్టెంబరు 9: పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం ఉదయం చైర్‌పర్సన్ వెంకటరమణ, కమిషనర్ అంజయ్య తనిఖీ చేశారు. శానిటేషన్, డ్రెయినేజీల నిర్వహణ, తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. పొన్నపల్లిలోని గోదావరి గట్టును పరిశీలించారు. వార్డులోని ముంపు నీరును మోటార్ల సాయంతో గోదావరికిలోకి తోడాలని ఆదేశించారు.

సూర్య అధ్యాపకునికి డాక్టరేట్


అధ్యాపకుడు సతీశ్‌ను సన్మానిస్తున్న యాజమాన్యం, సిబ్బంది

నరసాపురం టౌన్, సెప్టెంబరు 9: పట్టణంలోని సూర్య విద్యా సంస్థల్లో సంస్కృత విభాగంలో అధ్యాపకుడుగా పని చేస్తున్న ఆర్.సతీశ్‌కు నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం చేసింది. తెలుగు సాహిత్యంలో ఆయన చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది. సతీశ్‌ను సోమవారం కళాశాల యాజమాన్యం, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

రైల్వే స్టేషన్ల పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న డివిజనల్ కమర్షియల్ మేనేజర్

భీమవరం క్రైం, సెప్టెంబరు 9 : భీమవరం టౌన్, జంక్షన్ రైల్వేస్టేషన్లను సోమవారం డివిజనల్ కమర్షియల్ మేనేజర్ రాంబాబు పరిశీలించారు. గత ఏడాది టౌన్ రైల్వే స్టేషన్ అమృత్ భారత్ రైల్వే స్టేషన్‌గా ఎంపిక కావడంతో స్టేషన్ పరిసరాలు, సిబ్బంది పనితీరు పరిశీలించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. అలాగే జంక్షన్ రైల్వేస్టేషన్‌ను కూడా పరిశీలించి రైల్వే ట్రాకింగ్ సిస్టమ్ పనితీరు పలు అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు జంక్షన్ మేనేజర్ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహం తనిఖీ

మొగల్తూరు,సెప్టెంబరు 9: మొగల్తూరులోని ఎస్సీ బాలకల వసతి గృహన్ని జిల్లా సాంఘీక సంక్షేమాధికారి కె.శోభారాణి సోమవారం సాయంత్రం తనిఖీ చేశారు. అద్దె గృహంలో నిర్వహిస్తున్న ఈవసతి గృహాన్ని పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు ఆరా తీశారు.




తాడేపల్లిగూడెంలో లడ్డూ వేలం.. పెంటపాడులో గణనాథుడిని దర్శించుకుంటున్న టీడీపీ నాయకులు.. పాలకొల్లు శంభేశ్వర స్వామి ఆలయంలో వినాయకుడు

వైభవంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు

పోడూరు, సెప్టెంబరు 9: పెనుమదం శ్రీఉమాఅగస్త్యేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో మహా గణపతి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ మట్టి వినాయకుడికి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. చెర్వుగట్టు వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడికి, పట్టాభిరామాలయం వద్ద ప్రతిష్ఠించిన వినాయకుడికి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

పాలకోడేరు: విస్సాకోడేరులో 14అడుగుల గణనాధుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మండలంలోనే ఎత్తైన విగ్రహంగా చెబుతున్నారు. గొల్లలకోడేరు సంజనా అపార్ట్‌మెంట్స్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని మండపం వద్ద శ్రీకృష్ణ మందిరం సభ్యులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాలకొల్లు అర్బన్: వినాయక చవితి సందర్భంగా మూడవ రోజు సోమవారం 24వ వార్డులోని శంభేశ్వర స్వామివారి ఆలయంలో ఏర్పాటు చేసిన గణనాధుని విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు ప్రసాద వితరణగా వించారు. అలాగే ప్రత్యేక పందిళ్ళలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భీమవరం టౌన్: మెంటే వారితోటలోని బాలా త్రిపుర సుందరీ అమ్మవారి ఆలయంలో ఉన్న శ్రీ విజయ గణపతి స్వామికి పెన్నులతో అలంకరణ చేశారు. పెరవలి సుబ్బారావు, అనంతలక్ష్మి దంపతులు సౌజన్యంతో అలంకరణ నిర్వహించారు.

పెంటపాడు: పెంటపాడు వెలమ సంఘం మేడ వద్ద తాండ్ర పాపారాయుడు యూత్ ఆధ్వర్యంలో భారీ గణనాథుడిని టీడీపీ నాయకులు కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, బండారు వెంకట్రావు తదితరులు దర్శించుకున్నారు. అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్ వద్ద సంస్థ అధినేత తనుబుద్ధి భోగేశ్వరరావు ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి రప్పించిన ప్రతిమను జాతీయ రహదారి పక్కన అందంగా ముస్తాబు చేసిన మందిరంలో ప్రతిష్ఠించగా ఇది ఆకర్షణగా నిలిచింది.

బాలగణపతి లడ్డూ వేలం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 9: చినతాడేపల్లిలోని బాలలంతా కలసి ప్రతిష్ఠించిన గణనాథుడి మండపం వద్ద సోమవారం లడ్డూ వేలం నిర్వహించారు. చిన్నారులే ఈ వేలంలో పాల్గొని లడ్డూ ప్రసాదం దక్కించుకోవడం విశేషం. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్, మాజీ సర్పంచ్ చిటకన శ్రీనివాస్ తదితరులు చిన్నారులను అభినందించారు.



వలవల బాబ్జికి విరాళం అందజేస్తున్న కోరుమిల్లి వాసులు... భీమవరంలో బియ్యం లారీకి జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

వరద బాధితులకు విరాళాల వెల్లువ

తాడేపల్లిగూడెం అర్బన్, సెప్టెంబరు 9: వరద బాధితుల కోసం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి పిలుపు మేరకు పలువురు సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విరాళాలు అందజేశారు. కోరుమిల్లి సర్పంచ్ గారపాటి భాస్కరరావు ఆధ్వర్యంలో గ్రామస్థులు రూ. 47 వేలు, చింతపల్లి నుంచి రూ. 15 వేలు, ప్రత్తిపాడు నుంచి రూ. 54 వేలు, టైలర్స్ అసోసియేషన్ చింతకాయల సత్యనారాయణ రూ. 10,100, నందమూరు నుంచి శనగన రాంబాబు మిత్రబృందం రూ. 25 వేలు, మారంపల్లి నుంచి మిద్దే కనకారావు రూ 10,116, సరిపల్లి సూర్యనారాయణరాజు రూ. 10 వేలు, గ్రామ టీడీపీ కార్యకర్తలు రూ. 5, 200, ఆరుళ్ళ నుంచి బెజవాడ శ్రీను, మిత్రబృందం రూ. 25 వేలు, గూడవల్లి నాగేశ్వరరావు, మిత్రబృందం రూ. 25 వేలు, కొమ్ముగూడెం నుంచి కుసులూరి రఘుప్రసాద్ రూ. 20 వేలు, ఆలపాటి నాగేశ్వరరావు రూ. 5 వేలు, నిమ్మగడ్డ శ్రీనివాసరావు రూ. 5 వేలు అందజేశారు.

బ్రాహ్మణ సమాఖ్య వితరణ

భీమవరం టౌన్, సెప్టెంబరు 9 : శ్రీఉమా సోమేశ్వర గునుపూడి బ్రాహ్మణ సమాఖ్య దాతల సహకారంతో సుమారు రూ.3 లక్షల 50 వేలు విలువ కలిగిన 1100 (5కేజీల బస్తాలు) బస్తాల బియ్యంను విజయవాడకు పంపించారు. ఎమ్మెల్యే అంజిబాబు వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగసాయి మాట్లాడుతూ పాతపాటి మురళీ రామరాజు సౌజన్యంతో 5వేల బ్రెడ్ ప్యాకెట్లను కలక్టరేట్‌లో అందించామని అన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు(చినబాబు) టీడీపి రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారథి, కోళ్ల నాగేశ్వరరావు, బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు వేలూరి హనుమ కిరణ్, కార్యదర్శి మారెళ్ళ అఖిలేష్, చెరుకుపల్లి సంతోష్, బ్రహ్మజ్యోసుల సత్య ప్రసాద్, డీఆర్వో ఉదయ భాస్కరరావు, డీఎల్‌డీవో కే అప్పారావు పాల్గొన్నారు.

మూడో రోజు
నిమజ్జనాలు

నరసాపురం టౌన్, సెప్టెంబరు 9: పట్టణ, మండలంలో సోమవారం గణనాధులను నిమజ్జనం చేశారు. మూడోవ రోజు కావడంతో ఆటోలు, వ్యాన్‌ల సాయంతో గణనాధులను పట్టణ వీధుల గుండా ఊరేగించి వశిష్టా గోదావరిలో నిమజ్జనం చేశారు. పట్టణంలోని భూపతివారివీధిలో బాల గణనాధుడ్ని చిన్నారులు తీన్‌మార్ వాయిస్తూ ఊరేగింపులా తీసుకెళ్లారు. పలువురు భక్తులు వినాయకుడిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు.

కాళ్ళ: కాళ్ళ లంక ప్రాంతంలో ఏర్పాటు చేసిన గణనాథుని నిమజ్జన కార్యక్రమం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. తీన్మార్ డప్పులు, బాణసంచా కాలుస్తూ మేళతాళలతో స్వామివారిని ఊరేగించి నిమజ్జనం చేశారు.

పెనుగొండ/ఆచంట: సిద్ధాంతంలో పలు సంఘాలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించి అనంతరం సిద్ధాంతం గోదావరిలో నిమజ్జనం చేశారు. ఆచంట మండలంలో కూడా పలు ప్రాంతాల్లో నిమజ్జనాలు ఘనంగా సాగాయి.

భీమవరం టౌన్: గునుపూడిలోని బంట్రోతుల వారి వీధిలో ఏర్పాటు చేసిన వినాయకునికి నిమజ్జనోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదానాన్ని జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు(చినబాబు) ప్రారంభించారు. మధ్యాహ్నం నుంచి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన క్రేన్ ద్వారా స్వామివారిని మేళతాళాలతో ఊరేగింపుగా తీసకువెళ్ళి తాడేరుకాల్వలో నిమజ్జనం చేశారు. ఇండస్ట్రియల్‌లో శ్రీ వర సిద్ధి వినాయక స్వామి ఉత్సవాలు సందర్బంగా సోమవారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఎంవీవీఎస్‌టి సత్యనారాయణమూర్తి (బ్యాటరీ మూర్తి), కొత్తపల్లి సత్యనారాయణ రాజు, సీహెచ్. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్ర: పెనుమంట్ర రాజీవ్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడిని ఊరేగించి నిమజ్జనం చేశారు. మేళ తాళాలు డప్పు వాయిద్యాలు నడుమ ఊరేగించారు. అనంతరం బ్రాహ్మణ చెరువు జి అండ్ వీ కెనాల్ లో నిమజ్జనం చేశారు



ఆచంటలో గణేశ్ ఊరేగింపు.. భీమవరంలో క్రేన్‌పై ఊరేగింపు



కాళ్ళ, నరసాపురంలలో గణనాథుల ఊరేగింపు

స.హ. చట్టంపై అవగాహన

పోడూరు, సెప్టెంబరు 9: సమాచార హక్కు చట్టం ప్రజలకు వజ్రాయుధం లాంటిదని ఈ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పోడూరు మండల వ్యవసాయశాఖ అధికారి జి.సత్యనారాయణ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం వల్ల ప్రతి అధికారికి పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ డి.రాజేష్, ఆర్‌ఐ కందుల రాంబాబు, మండల పరిషత్ ఏవో ఎన్.శ్రీనివాసరెడ్డి, పీఆర్ ఏఈ పి.ఏడుకొండలు పాల్గొన్నారు.

దోమలు చిన్నవే..ప్రమాదం పెద్దది!

గణపవరం, సెప్టెంబరు 9: దోమలు చిన్నవే..కానీ వాటి వల్ల వచ్చే వ్యాధులు పెద్దవని చాలా ప్రమాదకర మైనవని మలేరియా తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వైవీ.లక్ష్మణరావు తెలిపారు. గణపవరంలో సోమవారం ప్రజారోగ్యంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజంలో దోమలు ప్రమాద కరంగా తయారయ్యాయని, వాటి వల్ల మలేరియా, డెంగీ తదితర వ్యాధులు దోమకాటు ద్వారానే వస్తాయని లక్ష్మణరావు అన్నారు. ఇంటి పరిసరాల్లో నీటినిల్వలు పరిశీలించి మహిళలకు తగు సూచనలు చేశారు. ఎంపీహెచ్‌వో జాలాది విల్సన్‌బాబు, ఆరోగ్య సహాయకులు కృష్ణ, శ్రీనివాసరావు, యోహాను పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

పాలకొల్లు రూరల్ , సెప్టెంబరు 9 : తన స్వగ్రామం కాపవరంకు చెందిన సీనియర్ టీడీపీ కార్యకర్త అంగర సత్యనారాయణ ఇటీవల మరణించిన విషయం తెలిసిన మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ సోమవారం ఉదయం కాపవరం వెళ్ళి సత్యనారాయణ కుమారుడు శేషయ్యకు రూ. 10వేల ఆర్థిక సహాయం అందించారు.

గర్భిణులు పరీక్షలు చేయించుకోవాలి

పాలకొల్లు రూరల్, సెప్టెంబరు 9 : గర్భిణులు అన్ని రకాల పరీక్షలు చేయించుకోవడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని లంకలకోడేరు పీహెచ్‌సీ డాక్టర్ నవ్య జీవన్ అన్నారు. పీహెచ్‌సీలో సోమవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు డాక్టర్ నవ్య జీవన్ పలు సూచనలు చేశారు.

అర్చకుడి వైద్యానికి రూ.30వేల సాయం

నరసాపురం రూరల్, సెప్టెంబరు 9: కొప్పర్రు గ్రామానికి చెందిన రామాలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసుల సూరిబాబు ఇటీవల బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చి ఆస్పత్రిలో చేరారు. జనసేన నాయకులు పోలిశెట్టి శ్రీనివాస్ తనవంతు సాయంగా వైద్యఖర్చుల నిమిత్తం రూ.30వేల ఆర్థిక సాయం చేశారు.

డీఆర్‌యుసీసీ సభ్యునిగా జక్కంపూడి



పాలకొల్లు అర్బన్, సెప్టెబరు 9: విజయవాడ రైల్వే జోన్ డీఆర్‌యుసీసీ సభ్యునిగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్ నియమితులయ్యారు. కుమార్‌కు డీఆర్‌యుసీసీ సభ్యునిగా 2వ సారి అవకాశం లభించింది.

కేటరింగ్ శేషగిరి కన్నుమూత



పోడూరు, సెప్టెబరు 9: పెనుమందం గ్రామానికి చెందిన బ్రాహ్మణ సంఘ నాయకుడు భావరాజు శేషగిరి రావు (56) ఊపిరితిత్తుల వ్యాధితో చికిత్స పొందుతూ సోమవారం మరణించారు. శేషగిరి రావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దేవాలయాల్లో దైవ నివేదనకు వంటలు చేయడంతో పాటు వివాహాది శుభ కార్యాలకు కేటరింగ్ చేస్తూ మంచి పేరు తెచ్చుకున్న శేషగిరిరావు మరణం పట్ల పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాలకు చెందిన బ్రాహ్మణ సంఘ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

పది గ్రామాలకు చెక్కులు అందజేత

పాలకొల్లు రూరల్ (యలమంచిలి), సెప్టెబరు 9: రాష్ట్రంలో వరద ప్రభావిత 400 పంచాయతీలకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సొంత సొమ్ములను విడుదల చేసిన నేపథ్యంలో యలమంచిలి మండలంలోని ముంపునకు గురైన 10 గ్రామాలకు ఒకొక్క గ్రామానికి లక్ష చొప్పున 10 గ్రామాలకు రూ. 10లక్షల చెక్కులను సోమవారం యలమంచిలిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయకర్ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మండల నాయకుడు కొడవటి వర బాబు, మాజీ మంత్రి సుబ్బారాయుడు, బన్నీ వాసు, కొటికలపూడి గోవిందరావు, బోనం చినబాబు పాల్గొన్నారు.

స్కూల్ ఆయాల తొలగింపు అన్యాయం

పెనుగొండ, సెప్టెంబరు 9: పాఠశాలలు మొదలైన ఐదు నెలలు తరువాత పాఠశాలలను శుభ్రపరిచే ఆయాలను తొలగించడం అన్యాయమని సీఐటీయు ఆధ్వర్యంలో పెనుగొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ అనిత కుమారికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ కార్మికులకు ఆగస్టు నెల వరకు ఉన్న వేతన బకాయిలు చెల్లించకుండా తొలగించడం దుర్మార్గమన్నారు.

వేమవరంలో నీట మునిగిన పొలాలు

ఆచంట, సెప్టెంబరు 9: భారీ వర్షాలు కారణంగా ఆచంట వేమవరం నక్కల కాలువకు ఆనుకుని ఉన్న పంట పొలాలు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. ఇప్పటికే ఒక సారి నాట్లు వేయగా, ఇటీవల వచ్చిన భారీ వర్షాలు కారణంగా పూర్తిగా నీట మునిగి నాట్లు పాడయ్యాయి. మరలా రెండవ సారి నాట్లు వేయగా ప్రస్తుతం నక్కల కాలువ ఉధృతి కారణంగా మరోసారి నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. ఈ ప్రాంత పొలాలు తరచూ ముంపునకు గురవకుండా శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

ముందస్తు చర్యలు తీసుకోవాలి: జేసీ


పిప్పరలో అధికారులతో మాట్లాడుతున్న జేసీ

ఉండి సెప్టెంబరు 9: యండగండి వద్ద యనమదుర్రు డ్రెయిన్ రెండోవ ప్రమాద హెచ్చరిక జారీ చేయక ముందే ముందుస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం యండగండిలోని లాకులు, బ్రిడ్జి, ప్రధాన పంటకాలువను పరిశీలించారు. డ్రెయినేజీ, ఇరిగేషన్ అధికారులను ఆయా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం లాకులు, షట్టర్లు, గేట్లు పనితీరు ఎలా వున్నది ఎప్పడికప్పుడు పరిశీలన చేయాలని ఆదేశించారు. యనమదుర్రు మొదటి ప్రమాద హెచ్చరిక 29అడుగులు కాగా 29.2అడుగులు చేరి మొదటి ప్రమాద హెచ్చరిక నడుస్తున్నదని, నీటిమట్టం 31అడుగుల పెరిగితే రెండోవ ప్రమాద హెచ్చరిక జారీ చేస్తామని జలవనరులశాఖ అధికారులు జిల్లా జాయింట్ కలెక్టరుకు వివరించారు.

గణపవరం: అధిక వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదనీరు పోటెత్తడంతో యనమదుర్రు డ్రెయిన్ ఉగ్రరూపం దాల్చింది. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారని సంబంధిత అధికారులంతా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం పిప్పర గ్రామాన్ని సంబంధిత అధికారులతో జేసీ పరిశీలించారు. యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెనను, డ్రెయిన్ ఉధృతిని పరిశీలించారు. డ్రెయిన్ వెంబడి గట్లు ఎక్కడ బలహీనంగా ఉన్నాయో వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలన్నారు. ఇసుక బస్తాలు, గెడలు, సర్వేబాదులు, వెదురు తడికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

లాకులు, షట్టర్లు తనిఖీ చేయాలి: జేసీ

తణుకు, సెప్టెంబరు 9: లాకులు, షట్టర్లు, గేట్లను ఎప్పటికప్పుడు పరిశీలించి మరమ్మతులు చేయించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం అత్తిలి మండలం తిరుపతిపురం, తణుకు మండలం దువ్వ గ్రామాల బ్రిడ్జి, ప్రధాన కాలువ ఉధృతిని, పంట పొలాలను అధికారులతో కలసి పరిశీలించారు.

డ్రెయిన్‌లలో పూడిక తొలగింపు

తణుకు, సెప్టెంబరు 9: పట్టణంలోని 1, 3 వార్డుల్లో గ్యాసు గొడౌన్ ప్రాంతంలో మురుగు, వర్షం నీరు చేరి కచ్చా డ్రెయిన్ పూడుకుపోయి ఆరు రోజులుగా ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో విషయాన్ని సోమవారం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి ఎక్స్‌కవేటర్‌తో డ్రెయిన్‌లో పూడికలు తీయాలని ఆదేశించారు. ఆ మేరకు సిల్టు తొలగించి నీరు నిల్వ లేకుండా చేశారు. పనులను టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కలగర వెంకట కృష్ణ, ఒమ్మి రాంబాబు, తాతపూడి మారుతీరావు, తాతాజీ, చిట్టూరి హరినాథ్ తదితరులు పర్యవేక్షించారు.

బాధితులను అండగా కూటమి: బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, సెప్టెంబరు 9: వరద బాధితులందరినీ కూటమి ప్రభుత్వం ఆదుకునేందుకు సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు సోమవారం విజయవాడ ముంపు ప్రాంతాల్లో ఆయన పర్యటించి మాట్లాడుతూ మరో రెండు రోజులు తాను ఇక్కడే ఉంటానని, సహాయక చర్యలు తీసుకుంటామన్నారు.

పంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్: కలెక్టర్

భీమవరం టౌన్, సెప్టెంబరు 9 : జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో నెల రోజుల నుంచి అధిక వర్షాల నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని అన్ని తాగునీటి వనరుల ను క్లోరినేషన్ చేయడంతో పాటు, సూపర్ క్లోరినేషన్ చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాలలో నిలిచిపోయిన నీటి ని తొలగించాలన్నారు. డ్రెయిన్లు యుద్ధ ప్రాతిపదికన శుభ్రపరిచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

కూరగాయల ధరలు నియంత్రించాలి

భీమవరం టౌన్, సెప్టెంబరు 9 : బహిరంగ మార్కెట్లో కూరగాయల ధరలు నియంత్రణలో ఉంచేందుకు తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. సోమవారం జేసీ చాంబర్‌లో మార్కెటింగ్, సివిల్ సప్లైస్, బియ్యం, కందిపప్పు హోల్‌సేల్ అసోసియేషన్‌తో సమావేశమై మాట్లాడారు. బహిరంగ మార్కెట్లో కూరగాయలు ధరలు స్థిరీకరించేందుకు చర్యలు తీసు కోవాలన్నారు.

స్టాఫ్ నర్సుల నిరసన



భీమవరం క్రైం, సెప్టెంబరు 9 : జీవో నెంబర్ 115 ప్రకారం ఏఎన్‌ఎంలకు జేఎన్‌ఎం హోదా ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నామని భీమవరం ఏరియా ప్రభుత్వాసుపత్రి స్టాఫ్ నర్సులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం వారు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఏఎన్‌ఎంలకు 3 సంవత్సరాలు పాటు జీతం ఇస్తూ స్టాఫ్‌నర్సులుగా ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. మళ్ళీ ఇప్పుడు వారందరికీ పోస్టింగ్‌లు ఇచ్చి జీతంపై 5వేలు అధికంగా ఇస్తున్నట్లు ప్రకటించడంపై వ్యతిరేకిస్తున్నామన్నారు. ఏఎన్‌ఎంలకు నాలుగు రకాల ఉద్యోగోన్నతులు అమలు చెయ్యకుండా స్టాఫ్ నర్సుల ప్రమోషన్లు కబ్జా చేస్తున్నారని మీడియా ముందు తెలిపారు.

కోడిపందేలపై దాడి

పాలకొల్లు రూరల్, సెప్టెంబరు 9 : దగ్గులూరులో కోడి పందేలు ఆడుతున్న సమాచారం మేరకు సోమవారం దాడి చేసినట్టు ఎస్ఐ డి హరికృష్ణ తెలిపారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి ఒక కోడిని, కోడి కత్తి, రూ. 2వేల నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ముంపు పొలాల పరిశీలన


పాలకొల్లు మండలంలో పర్యటిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

పాలకొల్లు రూరల్/ఆచంట, సెప్టెంబరు 9: జిల్లా వ్యవసాయశాఖాధికారి వెంకటేశ్వరరావు సోమవారం పాలకొల్లు మండలంలోని పలుగ్రామాల్లో పర్యటించారు. ఆయన వెంట ఏడీఏ పార్వతి, వ్యవసాయ శాఖ మండల అధికారి రాజశేఖర్ ఉన్నారు. మండలంలో 14 గ్రామాల్లో 490 ఎకరాలు పంట నష్టం జరిందని తెలిపారు. ఎస్‌చిక్కాల, ఆగర్రు, గోరింటాడ, వెలివెల, ఉల్లంపర్రు దిగమర్రు, లంకలకోడేరు, వరిధనం తిల్లపూడి, పెదమామిడిపల్లి, చందపర్రు, చింతపర్రు గ్రామాల్లో వారు పర్యటించారు ఈసందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ లోపుగా ఈకెవైసీ పూర్తి చేసుకోవాలని రైతులకు సూచించారు. ఆచంటలో నక్కల డ్రెయిన్ ఉధృతి కారణంగా నీట మునిగిన పొలాలను జిల్లా వ్యవసాయాదికారి వెంకటేశ్వరరావు పరిశీలించారు.

భీమవరం రూరల్ : వర్షపునీటి ముంపు బారినపడిన పొలాలలో నీరు బయటకు వెళ్లేలా రైతులు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ సూచించారు. సోమవారం యనమదుర్రులో ముంపు పొలాలను ఆయన పరిశీలించారు. ముంపునీరు తగ్గిన తరువాత వరి చేనుకు చేయవలిసిన సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు.

కాళ్ళ: ముంపు పొలాలను రెవెన్యూ వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. కోపల్లె, సీసలి, కాళ్ళకూరు, ఏలూరుపాడు తదితర గ్రామాలలో పర్యటించినట్లు అధికారులు తెలిపారు. మండలంలో సుమారు 700 ఎకరాలు ముంపునకు గురైనట్లు తెలిపారు. అదేవిధంగా మండలంలో ఉప్పుటేరును పరిశీలించారు.